మాధవునికీ రక్షణ కరవు..!

- ఆలయ పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు
- నెల రోజుల క్రితం ఆభరణాల అపహరణ
- నేటికీ దొంగలను గుర్తించని పోలీసులు

మద్రిపాలెం : పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఇటీవల కాలంలో మనుషులకు ఎలాగూ రక్షణ లేకుండా పోయింది... ప్రస్తుతం దేవునికీ అదే పరిస్థితి ఎదురవడం విధి వైచిత్రం. పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణంలో కొండల మధ్య జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో కొలువైన స్వయంభూ శ్రీలీలామాధవస్వామికి నిజంగానే రక్షణ కరువైంది. ఒకవైపు దొంగల భయం... మరోవైపు కనీస ఆదాయం లేకపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. పేరుకే సింహాచలం ఉప దేవస్థానం తప్ప పండగలు, ఇతర ప్రత్యేక రోజుల్లో ఉత్సవాల నిర్వహణకు కనీస ఏర్పాట్లకు కూడా ఈ దేవాలయం నోచుకోవడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఆలయానికి ఇవ్వాల్సిన రేషన్ 26 సంవత్సరాలుగా సింహాచలం దేవస్థానం అధికారులు ఇవ్వడం లేదని స్థానిక అర్చకులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎప్పటి నుంచో భక్తులు సమర్పిస్తున్న ఆభరణాలు కొద్ది రోజుల కిందట దొంగల పాలయ్యాయి. దొంగతనం జరిగిందని సింహాచలం ఈవోకి ఫోన్ చేస్తే అతని పీఏ మాట్లాడారని... ఆఖరుకు తమకు సంబంధం లేదని చేతులెత్తేశారని అర్చకులు ఆరోపిస్తున్నారు.


డీవీఆర్ బాక్స్‌ను అపహరించింది ఇక్కడే..


ఆలయానికి వెళ్లే మలుపులో కమాండ్ కంట్రోల్ కెమెరాలు (ఇన్‌సెట్) ఆభరణాలు లేకుండా శ్రీ లీలా మాధవస్వామి

ఇంత వరకు రికవరీ శూన్యం

ఆగస్టు 12న రాత్రి ఈ ఆలయంలో దొంగలు పడి స్వామి వారు, అమ్మవార్ల బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి ఎత్తుకుపోయారు. స్వామి వారి పూజ చేయడానికి ఆగస్టు 13న ఉదయం అర్చకుడు వెళ్లి చూసేసరికి నగలు లేకపోవడంతో నిర్ఘాంతపోయారు. వెంటనే వారంతా కంచరపాలెం క్రైం పోలీసులకు సమాచారం అందించి, ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే దొంగతనం జరిగి నెల రోజులు కావస్తున్నా దుండగుల జాడే లేదు. తెలివిగా దొంగలు వస్తూనే సీసీ కెమెరాలు ఉన్న డీవీఆర్ బాక్స్ కనెక్షన్‌ను పీకేసీ దానిని ఎత్తుకెళ్లిపోయారు. 71 గ్రాముల బంగారం, 4 కేజీల వెండి సామగ్రి అపహరించారని అర్చకులు చెబుతున్నారు. పోలీసు అధికారులు ఘటనా స్థలికి వచ్చి చూసినప్పటికీ ఈ రోజుకీ కేసులో పురోగతి లేదు. ఇప్పటికీ దొంగలను గుర్తించి, ఆభరణాలు రికవరీ చేయకపోవడం దారుణమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రైం రేటు తగ్గించాలని హడావిడి చేస్తున్నప్పటికీ, ఇలాంటి దొంగతనాలు జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడంలో మాత్రం పోలీసులు పురోగతి సాధించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దొంగలను పట్టుకుంటాం

మాధవస్వామి ఆలయంలో చోరీ కేసుపై దృష్టి సారించాం. ఆ కేసు పరిష్కరించే దిశగా పనిచేస్తున్నాం. బృందాలుగా ఏర్పడి స్వామి వారి నగలు దొంగలించిన వారిని పట్టుకుంటాం.

– ఎస్.శ్రీనివాస్, క్రైం సీఐ, కంచరపాలెం


ఆలయ పరిసరాల్లో మందు సీసా, సిగరెట్ ప్యాకెట్లు, అగ్గిపెట్టెలు

గస్తీ లేక రెచ్చిపోతున్న ఆకతాయిలు

ఆలయ పరిసర ప్రాంతాల్లో రాత్రి గస్తీ లేకపోవడంతో అడ్డూ అదుపు లేకుండా ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళ ఆలయానికి వెళ్లే మార్గం చీకటిగా మామిడి తోటలతో ఉండడంతో ఆ ప్రదేశాన్ని కొందరు అడ్డాగా మార్చుకున్నారు. అడ్డూ అదుపు లేకుండా అసాంఘిక కార్యకలాపాలు కానిచ్చేస్తున్నారు. ఆలయానికి ఆమడ దూరంలో గంజాయి, మందు వంటివి సేవించి అక్కడే సీసాలు పడేస్తున్నా దేవస్థానం సిబ్బంది కూడా పట్టించుకోకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ రోడ్డు మలుపులో దిష్టిబొమ్మల్లా కమాండ్ కంట్రోల్ కెమెరాలు ఉన్నా... దొంగతనం జరిగి నెల రోజులు కావస్తున్నా ఇంతవరకు దొంగలు మాత్రం దొరకలేదు. క్రైం పోలీసులు రెండు, మూడు సార్లు వచ్చి చూసి వెళ్లారే తప్ప కేసులో పురోగతి లేదు. పోలీసులు ఇప్పటికైనా దొంగలను పట్టుకోవాలని, ఆలయ పరిసరాల్లో నిఘా పెంచాలని భక్తులు కోరుతున్నారు.


గర్భగుడిలో కొత్తగా ఏర్పాటు చేసిన కెమెరా

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార : బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీసులు తెలిసిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం రామచంద్రనగర్‌కి చెందిన 11 సంవత్సరాల బాలిక ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అడ్డుకుని చెయ్యి పట్టుకుని బలవంతంగా బైకు పైకి ఎక్కించడానికి ప్రయత్నించాడు. దీంతో భయపడిన బాలిక అతని బారి నుంచి తప్పించుకుని ఇంటికెళ్లి తల్లిదండ్రులకు విషయం వివరించింది. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే స్థానికులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఫోక్సో చట్టం సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో మహిళా ఎస్ఐ ప్రమీల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు విజయనగరం జిల్లా జామికి చెందిన ఎర్రినాయుడు(45)గా గుర్తించారు.

డిస్ట్రిక్ట్ - 101 ఎలక్ట్ గవర్నర్‌గా మహేశ్వరరావు


మహేశ్వరరావు

మురళీనగర్ : వాకర్స్ డిస్ట్రిక్ట్ – 101 ఎలక్ట్ గవర్నర్‌గా ఆర్ఆర్ఎస్ మహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల 2025 సంవత్సరానికి డిస్ట్రిక్ట్ – 101 ఎలక్ట్ గవర్నర్ పదవికి ఎన్నికలు నిర్వహించారు. ఈ పదవికి మహేశ్వరరావు నుంచి మాత్రమే నామినేషన్ రావడంతో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ శీలం ఐజాక్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన 2026 సంవత్సరానికి గవర్నర్‌గా వ్యవహరిస్తారు. ఆయన 2022, 2023 సంవత్సరాల్లో ఇండస్ట్రియల్ ఎస్టేట్ త్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షునిగా, 2023, 2024 సంవత్సరాలకు డిస్ట్రిక్ట్ – 101 కోర్ కమిటీ సభ్యునిగా పని చేశారు. ప్రస్తుతం వాకర్స్ బులిటెన్ సంపాదకుడిగా సేవలందిస్తున్నారు. అంతేకాకుండా 2025 సంవత్సరానికి 101 క్యాబినెట్ కార్యదర్శిగా నామినేట్ అయ్యారు. ఈ మేరకు మహేశ్వరరావును పలు వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు, వాకర్స్ అభినందించారు.

క్లుప్తంగా

లడ్డూ @ రూ.4.5 లక్షలు


గణపతికి నివేదించిన 50 కిలోల లడ్డూ

సీతమ్మధార : స్థానిక రైతుబజార్ సమీపంలో గల ఆక్సిజన్ టవర్స్ అపార్ట్‌మెంట్ ఆవరణలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి వినాయకుని ప్రసాదమైన 50 కిలోల లడ్డూ వేలం పాటలో భక్తులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. చివరికి లడ్డూని అపార్ట్‌మెంట్‌కి చెందిన హర్ష రూ.4.50 లక్షలకి వేలం పాడారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆక్సిజన్ టవర్స్ నివాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో అన్నదానం నేడు


రైతుబజార్‌లో పూజలందుకుంటున్న వినాయకుడు

సీతమ్మధార : స్థానిక రైతుబజార్‌లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడి రైతులు, వ్యాపారుల సహకారంతో సిబ్బంది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రైతుబజార్‌లో బుధవారం మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేస్తామని ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ తెలిపారు. భక్తులంతా ప్రసాదం స్వీకరించాలని కోరారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ద్వారకా పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్‌కి చెందిన సునీల్ మేఘవాల్ (23) ఒడిశాలో గంజాయి కొనుగోలు చేశాడు. ఆ సరకుతో మంగళవారం రామాటాకీస్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించడంతో అక్కడే ఉన్న ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో సదరు నిందితుడు ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసినట్లు అంగీకరించాడు. ద్వారకా స్టేషన్ సీఐ డి.వి.రమణ పర్యవేక్షణలో ఎస్ఐ శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరంలోని చినవాల్తేరు ప్రాంతానికి చెందిన సాయిదిలీప్‌శర్మ రూ.1,00,116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. స్వామివారి ఆలయంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి దాతకు బాండ్‌ని ఇచ్చారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రాన్ని అధికారులు అందించారు. సీనియర్ అసిస్టెంట్ వరహాల రావు, ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులతో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్, తదితరులు

సీతంపేట : ఇటీవల తిరుపతిలో చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురుషుల, మహిళల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. బీఏ మొదటి సంవత్సరం విద్యార్థి పి.సాయిలోహిత్ కుమార్ 54 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించాడు. బీకాం మొదటి సంవత్సరం విద్యార్థి కె.భాగ్యరాజు 87 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. వీరిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు అభినందించారు.

49 మంది డ్రైవింగ్ లైసెన్సుల రద్దు


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార : నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు ద్వారకా పోలీసులు రోజూ స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీలు చేస్తున్నారు. ప్రభుత్వం ట్రాఫిక్ నిబంధనలలో తీసుకొచ్చిన మార్పులు ఈ నెల ఒకటి నుంచి అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వాహనదారులకు హెల్మెట్ లేకపోవడం, వెనుక కూర్చున్న వారు సైతం హెల్మెట్ లేకుండా వుంటే కేసులు నమోదు చేసి తాత్కాలికంగా డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్టేషన్ పరిధిలో గల ఆర్టీసీ కాంప్లెక్స్, గురుద్వారా, ఆశీలుమెట్ట, రామాటాకీస్ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 49 మంది వాహన చోదకుల డ్రైవింగ్ లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేశామని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎన్.వి.భాస్కరరావు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 400 మంది వాహన చోదకుల డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేశామని తెలిపారు.

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

- పోరాడి, సాధించాలి
- కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు


సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: సమస్యలకు ఆత్మహత్యే పరిష్కారం కాదని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. జీవితం ఎంతో విలువైందని, దానిని చేజార్చుకోవద్దని సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినాన్ని పురస్కరించుకుని కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవితం ఓ ప్రయాణమని, ఎన్నో ఒడిదుడుకులు ఎదురవుతాయని అన్నారు. ధైర్యంగా నిలబడి వాటిని ఎదుర్కోవాలే గానీ, తొందరపాటుతో ముగించవద్దని హితవు పలికారు. సైక్రియాటిస్ట్ బి.నిత్య ఐశ్వర్య మాట్లాడుతూ నిశ్శబ్దాన్ని బద్దలు చేయాలన్నారు. ఈ రోజుల్లో ప్రతి 20 సెకండ్లకు ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారని, అందులో ఎక్కువ శాతం యువత ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. ఆత్మహత్యల నివారణకై సమాజంలో మార్పు తీసుకురావాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ అన్నారు. మానసిక ఇబ్బంది ఉన్న వారు గవర్నమెంట్ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1 4 4 16 ద్వారా మానసిక వైద్యుల సలహాలు, కౌన్సెలింగ్ పొందవచ్చని జాతీయ సేవా పథకం అధికారి పోలా ఉమామహేశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.శామ్యూల్ డేవిడ్ రాజ్, బి.లక్ష్మి, జి.వి.ప్రతాప్ పాల్గొన్నారు.


స్టాఫ్ నర్సుల కౌన్సెలింగ్ ఆపాలి


మాట్లాడుతున్న నర్సుల స్ట్రగుల్ కమిటీ స్టేట్ కో - ఆర్డినేటర్ కోటేశ్వరరావు

మహారాణిపేట: రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రుల్లో పని చేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్టు నర్సులు గడచిన ఐదు రోజులుగా నిరసన తెలియజేస్తున్నారు. మంగళవారం కేజీహెచ్ క్లాక్ టవర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సుల స్ట్రగుల్ కమిటీ స్టేట్ కో–ఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 11న ఏఎన్ఎంలకు స్టాఫ్ నర్సులుగా పోస్టింగ్ ఇస్తూ నిర్వహించే కౌన్సెలింగ్‌ను నిలిపేయాలన్నారు. లేని పక్షంలో తమ నిరసనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నెంబర్ 115ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నర్సింగ్ విద్యలో మూడు సంవత్సరాల డిగ్రీ చేసిన వారు, పీజీ చేసిన వారు కోవిడ్‌కు ముందు నుంచి కూడా తమ అమూల్యమైన సేవలు అందిస్తున్నారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బి.శాంతికుమారి, కె.సూర్యకళ, వి.వినీల, ఎస్.వరలక్ష్మి, ఎన్.శోభారాణి, వి. శేఖర్, సత్యనారాయణ, పోరాట కమిటీ సభ్యులు, హెడ్ సిస్టర్లు, రెగ్యులర్ స్టాఫ్ నర్సులు, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్కంద గణపతిగా దుర్గా గణపతి


సీతంపేట గణేష్‌నగర్‌లో ఆకట్టుకుంటున్న వీణా గణపతి


సీతంపేటలో స్కంద గణపతి అలంకరణలో దుర్గా గణపతి

సీతంపేట : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేట కూడలిలో కొలువైన దుర్గా గణపతి నాలుగో రోజు మంగళవారం స్కంద గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం, స్వామి వారికి పంచామృత అభిషేకం, చందన, విభూది, ఫల రసాలతో విశేష అభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. బుధవారం 'శివబాల గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు.

సీతమ్మధార : సీతమ్మధార బీఎస్ లే అవుట్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మంగళవారం దర్శించుకున్నారు. వీరితోపాటు అరకు పార్లమెంటరీ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి పరుకు రామరాజు, టీడీపీ జిల్లా ప్రెసిడెంట్ గండి బాబ్జీ, వెల్లంగి భరత్, సురేష్ బాబు, 14వ వార్డ్ ప్రెసిడెంట్ రాకేష్ తదితరులు గణనాథుని దర్శించుకున్నారు. కార్యక్రమంలో హరిత, ప్రకాష్‌రావు, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆర్గనైజర్స్ అజయ్, నాగరాజు, నాయుడు, ప్రతాప్, వెంకట్ పాల్గొన్నారు.

గణేష్‌నగర్‌లో వీణా గణపతి

సీతంపేట : గణేష్‌నగర్ యూత్ ఉప్పాడ సన్నీ ఆధ్వర్యంలో సీతంపేట గణేష్‌నగర్‌లో వినాయక చవితి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గత 30 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది వీణా గణపతిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రోజూ విశేష పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బీటీఆర్ కాలనీ 80 అడుగుల రోడ్‌లో స్థానిక యువత వినాయక నవరాత్రి ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన మండపం ఆకట్టుకుంటోంది. పెంకుటిల్లు మోడల్‌లో మండపం తయారు చేసి వినాయకుని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అటువైపు వెళ్లే వారు మండపాన్ని ఆసక్తిగా చూస్తున్నారు.

కారును ఢీకొన్న ఆటో


బీచ్ రోడ్డులో ప్రమాదంలో నుజ్జయిన ఆటో

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో మంగళవారం ఉదయం కారును ఓ ఆటో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... హోటల్ అంబికా సీ గ్రీన్ నుంచి వస్తున్న కారు ఆర్కే బీచ్ వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించగా... అదే సమయంలో ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ముగ్గురు మహిళా ప్రయాణికులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆటో ముందు భాగం పూర్తిగా నుజ్జుకాగా కారు పాక్షికంగా దెబ్బతింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


అధ్వానంగా వీధి లైట్ల నిర్వహణ


సీతమ్మధారలో వెలగని వీధి లైటు


రెండు లైట్లు ఉండాల్సిన స్తంభంపై... ప్రస్తుతం ఒకే లైట్ ఉన్న దృశ్యం

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలో వీధిలైట్ల వ్యవస్థ అధ్వానంగా తయారైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతమ్మధార, సత్యం జంక్షన్, గాంధీనగర్, క్రాంతినగర్, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, బాలయ్యశాస్త్రి లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో లైట్లు సక్రమంగా వెలగడం లేదని వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పగలు కూడా లైట్లు వెలుగుతున్నాయని... అవసరమైనచోట మాత్ర అంధకారం నెలకొంటోందని మండిపడుతున్నారు. జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ పాఠశాల పరిసర ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగక రాత్రిపూట అంధకారం అలుముకుంటోందని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట డ్యూటీ నుంచి ఇంటికెళ్లే ఉద్యోగులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి చాలా స్తంభాలకు ఏర్పాటు చేసిన మోడ్రన్ లైట్లు వెలగడం లేదు. కొన్నిచోట్ల ఒక పోల్‌కి రెండు లైట్లు వుంటే ఒకటి వెలగడం లేదు. ఒక్కో ప్రాంతంలో వీధిలైట్లకు చెట్టు కొమ్మలు అడ్డంగా ఉండడంతో అంధకారం నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు అంధకారం, మరోవైపు కుక్కల బెడద కారణంగా రాత్రిపూట పాదచారులు, వాహనచోదకులు పడరానిపాట్లు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని... ఫిర్యాదు చేస్తున్నా సకాలంలో జోన్ – 3 ఇంజినీర్లు మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ఉత్తర నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో వెలగని వీధి లైట్లకు మరమ్మతులు నిర్వహించాలని, మాయమైన లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

యూడైస్‌లో వివరాలు నమోదు చేయకుంటే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు యూడైస్‌లో సక్రమంగా వివరాలు నమోదు చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. చినగదిలి, సీతమ్మధార మండలాల్లో ఉన్న ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కరెస్పాండెంట్లతో మంగళవారం విశాఖ వేలీ స్కూల్‌లో యూడైస్ – 2024 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూడైస్‌లో పాఠశాలలు, వాటిలో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాలను సక్రమంగా, సకాలంలో నమోదు చేయాలని సూచించారు. నమోదు చేసిన అనంతరం ఎలాంటి తప్పులు ఉన్నా ఇచ్చిన గడువులోగా మళ్లీ సరి చేసుకోవాలని తెలిపారు. లేదంటే అప్‌లోడు చేసిన తర్వాత సరిద్దుకోవడానికి అవకాశం ఉండదన్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి చెందినదని, అందుకే అప్‌లోడు చేసిన అనంతరం సరిచేసుకోవడానికి అవకాశం ఉండదని తెలిపారు. యూడైస్‌లో ఉన్న విధంగా సరైన సమాచారం నింపని పాఠశాలల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో రవీంద్రబాబు, ఏపీవో అప్పలనాయుడు, సీతమ్మధార ఎంఈవో రామారావు, ఏఎస్‌వో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.